**కథ**

# దటీజ్ చలపతి

**విడిదింట్లో సోఫాలో విలాసంగా కాలుమీద కాలేసుకుని కూర్చుని చుట్టూ పరికిస్తూ ఏదో పోగొట్టుకున్నది వెతుక్కుంటున్నట్టు చూస్తున్నాడు చలపతి.**

**ఒక ముప్పావుగంట క్రితమే విడిదింట్లో ప్రవేశించారు మగపెళ్ళివారు చలపతితో సహా.**

**చాలా పెద్దహాల్లో వేసి వున్న సోఫాల మీద, కుర్చీల మీద, మంచాల మీదా కూచుని రెండు డ్రెస్సింగ్ టేబుళ్ళ దగ్గరా, ముందున్న ఆర్చీ పిట్టగోడ వారగా, పూలకుండీల దగ్గర నిల్చుని జాలీగా జోకులు పేలుస్తూ మాట్లాడుకుంటున్నారు.**

పెళ్ళికొడుకు తల్లి ఒక టేబుల్ ముందున్న కుర్చీలో సెటిలయి చుట్టూ పరివేష్టించి వున్న ఆడబంధు జనంతో పిచ్చాపాటీలో మునిగిపోగా, పెళ్ళికొడుకు తండ్రిగారు జన్మలో దివాన్ మంచమే చూసి ఎరగనట్లు కళ్ళు మూసుకుని కాళ్ళు బారజాపుకుని దానిమీద పవళించి పరవశత్వాన్ని పొందుతున్నాడు. ఆయన బావమ్మరిది శరణువేడుతున్నట్లు ఆయన కాళ్ళ దగ్గరే చతికిలబడి ఏదో మాత్రను నాలుకతో పాదువుకుంటూ చప్పరిస్తున్నారు.

ఇక యిద్దరు ఆడబడుచులూ తమ పిల్లలెక్కడ తప్పిపోతారోనన్నంత ఆతృతతో వరండాలో ఆడుకుంటూన్న పిల్లల చుట్టూ పరుగులు పెడ్తున్నారు. ఇక బస్సులో వచ్చిన బీరకాయ పీచు చుట్టాలు ఏదో పెట్టింది తినేసి, యిచ్చింది తాగేసి ముహూర్తం అయిపోయి, అప్పగింతలు జరిగిపోగానే మళ్ళీ బస్సులో తిరిగెళ్ళిపోదాం అన్న ధోరణిలో దిక్కులు చూస్తూ అటూ యిటూ తిరుగుతున్నారు.

'మరి ఎవరికీ లేని తాపత్రయం తనకెందుకిలా పట్టుకుందీ?' తనను తానే ప్రశ్నించుకున్నాడు చలపతి.

మగపెళ్ళివారన్నాక కాస్తంత డాబూ, దర్జా, బెట్టుసరీ లేకుండా జైల్లో కుక్కిన క్రిమినల్స్‌లా వుంటే ఇక పెళ్ళిసందడి తీరేం బావుంటుందీ? అప్పటికీ ఈ అయోమయం మొహాలకి ఎప్పటికప్పుడు హింట్స్ అందిస్తూనే వున్నా ఎవరూ సుతరామూ పట్టించుకోవటం లేదు.

అదుగో! ఆ నిర్లక్ష్యమే నచ్చక ఏదో దూరపు చుట్టరికం దృష్టిలో పెట్టుకుని ఈ పెళ్ళికి తనెందుకువచ్చానా? అని మథనపడిపోతున్నాడు చలపతి. తీరా వచ్చాక తప్పుకు పోవటానికి మనసొప్పటం లేదు. అలా అని అందరితోపాటు అలా వుండిపోవటానికీ అంతకంటే మనసొప్పటం లేదు.

అక్కడికీ ఆడపెళ్ళివాళ్ళు పెళ్ళికొడుకు కోసం పంపించిన కారుకి ప్లాస్టిక్ పూలు అంటించటం తప్ప ఒక్క పూలమాల కూడా వేయలేదనీ, ఆహ్వానించటానికి వచ్చినవాళ్ళు ఒట్టి చచ్చుపీనుగుల్లా వున్నారనీ, విడిదిలో అద్దాలమీద అరచేతి మందాన దుమ్ము పేరుకుని వుందనీ, మంచాలమీదా, సోఫాల మీదా ఎప్పుడో దశాబ్దాల నాటి దుప్పట్లు పరిచారనీ, విడిది పైకప్పునకు అక్కడక్కడా బూజు, తాళ్ళు వేలాడుతున్నాయనీ, పెళ్ళికొడుకు తల్లిదండ్రుల దగ్గర్నుంచీ వేలు విడిచిన బంధువుల వరకూ చెవికొరికి మరీ చెప్పి చూశాడు.

విన్న ప్రతి ఒక్కరూ కొరికిన చెవిని తడుముకుని ఆ చెవిని వదిలేశారే గానీ ఒక్కసారైనా పట్టించుకుంటే ఒట్టు!

అదే చలపతికి పిచ్చి బాధగా వుంది.

ఇక్కడ ఎవరికీ మగపెళ్ళివాళ్ళకుండే బెట్టూ, చేవా లేశమైనా లేనట్లు అన్పిస్తోంది. చేలో పడ్డ గుడ్డెద్దు మొహాలూ, వీళ్ళూనూ!

చలపతి ఈ ఆలోచనలలో వుండగానే టిఫిన్లు పట్టించుకొచ్చారు మగపెళ్ళివారు. ఘుమఘుమలాడ్తున్న టిఫిన్ల పరిమళం నోరూరిస్తూండగా మధ్య టేబిల్ మీద దింపిన టిఫిన్లకేసి చూశాడు.

జీడిపప్పు పకోడీ, మసాలా ఉప్మా, గులాబ్ జామ్, అన్నీ అతనికి బహుఇష్టమైనవే!

టిఫిన్లన్నిటినీ చకచకా స్టీలు ప్లేట్లలో సర్ది ఒక్కొక్కరికీ అందించేస్తున్నారు హుషారుగా వున్న కుర్ర పనివాళ్ళు.

కొమ్మను అటునుంచి నరుక్కొస్తే ఎలా వుంటుందో చూద్దాం అన్న ఆలోచన రాగా తనకందిస్తూన్న ప్లేటు అందుకుంటూ ''ఈ మాత్రం టిఫిన్లివ్వటానికి యింత లేటా?'' అన్నాడు డాంబికంగా.

రెండు క్షణాలు చలపతి మొహంలోకి అమాయకంగా చూశాడు కుర్రాడు.

''మీరు మధ్యాహ్నం భోజనం చేయలేదాండీ?'' అన్నాడు అతి నెమ్మదిగా.

గతుక్కుమన్నాడు చలపతి.

ఆ కుర్రాడు తనను వేసిన ప్రశ్నను ఎవరైనా విన్నారేమోనని బితుకుబితుకుమంటూ చుట్టూ చూశాడు.

ఎవరికివాళ్ళు టిఫిన్లు లాగించటంలో నిమగ్నులై వుండటంతో గట్టిగా వూపిరి పీల్చుకుని కుర్రాడికేసి చూడబోతే వాడప్పటికే జారుకుని వెళ్ళిపోయాడు.

వాడి ద్వారా కాస్త దుమారం లేపుదామనుకున్న చలపతి పథకం అలా వీగిపోయింది.

చేసేది లేక సణుక్కుంటూ టిఫిన్ ఆరగించటం మొదలెట్టాడు.

''సార్! ఉప్మా, పకోడీ'' అంటూ వచ్చాడు మరో కుర్రాడు.

ఈసారైనా వాతావరణంలో కాస్త వేడి రేపుదామన్న ఉద్దేశ్యంతో ''ఏవిటయ్యా? ఉప్మాలోగానీ, పకోడీలోగానీ ఎక్కడా జీడిపప్పే తగలట్లేదు. మగపెళ్ళివారికి పెట్టే టిఫిన్లేనా యివి?'' గిన్నెలో ఉప్మాని స్పూన్‌తో ఎత్తిపడేస్తూ అన్నాడు.

''జీడిపప్పులా సార్? మీ కళ్ళజోడు యిక్కడ పెట్టేసి జీడిపప్పులు కన్పించమంటే ఎలా కన్పిస్తాయండీ?'' అంటూ సోఫాలో వున్న కళ్ళజోడును తీసి చలపతి కళ్ళకు తగిలించాడు.

**-వై.రుక్మిణీదేవి**

బిక్కచచ్చిపోయాడు చలపతి.

''ఊహు..సరేగానీ..రెండు గరిటెల పకోడీ వెయ్యి'' అన్నాడు వాడు వెళ్ళిపోతాడేమోనన్న ఆరాటంతో.

కుర్రాడు మూడు గరిటెల పకోడీ వేసి వెళ్ళిపోయాడు.

టిఫిన్లయ్యాక టీ, కాఫీ, ఓవల్టిన్ ఏది తాగే వాళ్ళకి అవి ఆఫర్ చేశారు.

మొదటవచ్చిన కుర్రాడు చలపతి దగ్గర కొచ్చి ''మీరేం తీసుకుంటారు సార్?'' అని అడిగాడు.

''నాకు హార్లిక్స్ కావాలి'' అన్నాడు చలపతి ఒళ్ళుమండిపోతూండగా.

''హార్లిక్స్ లేదు సార్ ఓవల్‌టీన్ తేనా?'' అడిగాడా కుర్రాడు.

''నేను ఓవల్టిన్ తాగను'' వెయ్యండి గా అన్నాడు.

''పోనీ కాఫీ, టీ?''

''అవేవీ వద్దు'' మొహం చిట్లించాడు.

''అయితే గ్లాసులో చల్లటి మంచినీళ్ళున్నాయి తాగేయండి'' చర్రున వెళ్ళిపోయాడా కుర్రాడు.

ఉసూరుమన్నాడు వాడి చర్యకు చలపతి. ఏమీ తోచక చుట్టూ తేరిపార చూశాడు.

రెండో ఆడబడుచు పిల్లాడి పాలబుడ్డిలో పాలు పోస్తున్నాడా కుర్రాడు.

చప్పున లేచి వెళ్ళి ''ఏయ్ ఆగు'' అని గర్జించాడు.

నివ్వెరపోతూ చలపతి వేపు చూశాడా కుర్రాడు.

''పసిపిల్లాడికి ఆ నీళ్ళ పాలు పోస్తావా? వెళ్ళి నీళ్ళు కలపని పాలు పట్రా'' విసురుగా పురమాయించాడు.

''దీంట్లో పౌడరు కలుపుతా మామయ్యా- యివి చాలు'' అంటూ ఆ పాలను బుడ్డినిండుగా పోయించుకుంది పద్మజ.

పోతూ పోతూ ఆ కుర్రాడు చూసిన చూపు గుండెలోంచి దూసుకుపోయినట్లనిపించింది చలపతికి.

అతను వెనుదిరిగిపోతూంటే ''బాత్ రూంలో సోప్ వుంచటం మరిచిపోయినట్లున్నారు'' అంటూ ఎదురొచ్చాడు పెళ్ళికొడుకు బాబాయి రెండో అల్లుడు.

అతనిమీద బోలెడు జాలిపడ్తూ ఏదో అనబోయిన చలపతి, నాలుగు పియర్స్ సోపులతో వచ్చిన మనిషిని చూసి టక్కున నోరు నొక్కేసుకున్నాడు.


''అన్నయ్యా! టిఫిన్ చేశావా?'' వాడిపోయినట్లున్న చలపతి మొహాన్ని చూసి అడిగింది పెళ్ళికొడుకు తల్లి సువర్చల.

''హు..చేశానమ్మా'' క్లుప్తంగా అనేసి వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. కూర్చున్నాక వుండబట్టలేక ''వీళ్ళ మర్యాదలు మరీ లోలెవల్లో అనిపిస్తున్నాయేంటీ?'' అన్నాడు వ్యంగ్యంగా.

''అవునవును. నీకలాగే అనిపిస్తాయిలే!'' తన మాటలు తనకే వినబడనంత మెల్లగా సణుక్కుంటూ అవతలికి వెళ్ళిపోయిందా విడ.

''మావయ్యా! లలితత్తయ్య రాలేదేంటి?'' పెద్దాడబడుచు పావని వచ్చి చనువుగా అతని పక్కన కూర్చుంటూ అడిగింది.

పేలవంగా నవ్వాడు చలపతి. ''పెద్దకోడలు పురిటికెళ్ళిందిగా. ఇంట్లో చూసుకునే వాళ్ళు ఎవరూ



లేక రాలేదమ్మా'' అన్నాడు.

''అక్కయ్యకిది రెండో పురుడా?''

''అవును''

''పెళ్ళికొడుకు ఫ్రెండ్స్ వచ్చినట్లున్నారు'' పావని భర్త లోపలి కొస్తూ అన్నాడు.

''వాళ్ళకు టిఫిన్లూ, అవీ చూడమని చెప్పండి ఫోన్ చేసి'' అని భర్తతో చెప్పి ''మళ్ళీ కలుస్తా మామయ్యా'' అని లోపలి గది లోకి వెళ్ళింది పావని.


''ఆ ఫ్రెండ్స్‌లో ఏవన్నా చలనం తెప్పించగలనేమో చూద్దాం'' లేచి వరండాలోకొచ్చి హడావిడిగా రెండు మెట్లు ఒక్కోసారి దిగుతూ క్రిందికి వెళ్ళబోయిన చలపతి కాలు జారి ముందుకు తూలాడు.

''అయ్యో కాలుజారిందాండీ'' ఎదురొస్తూన్న ఆడపెళ్ళివారి మనిషి అతన్ని వాటేసుకుని పడకుండా పట్టుకున్నాడు.

''కాలు..కాలు బెణికినట్లుంది'' మూలుగుతూ గొణిగాడు చలపతి.

''మిమ్మల్ని జాగ్రత్తగా పైకి తీసుకెళ్తానుండండి'' అని చలపతిని పొదివి పట్టుకుని మెల్లగా అడుగులేయిస్తూ పైకి జేర్చి తీసుకొచ్చి నెమ్మదిగా మంచమ్మీద పడుకోబెట్టాడాయన.

విడిదిలో వాళ్ళంతా బిలబిలలాడుతూ వచ్చి చలపతి చుట్టూ చేరారు.




''కాలు బెణికినట్లుంది'' అన్నాడు చలపతి కళ్ళు మూసుకుని.

''అయొడెక్స్ తెచ్చి మర్దిద్దాం..వుండండి'' చలపతిని పైకి తెచ్చినాయన కిందికి పరుగెట్టాడు.

''ఇంత...ఇంత పాటుపడితే డ్యాక్టర్‌కి ఫోన్ జెయ్యక అయొడెక్స్ తెస్తానంటాడేంటీ'' రెప్పలు రెపరెపలాడిస్తూ స్వగతంలా అన్నాడు చలపతి.

''అసలు నువ్వు కిందకెందుకు బయల్దేరావయ్యా చలపతీ?'' పెళ్ళికొడుకు తండ్రి ఆంజనేయమూర్తి అడిగాడు.

''కిరణ్ ఫ్రెండ్స్‌ని చూద్దామనీ...'' తాటి చెట్టెందు కెక్కావయ్యా? అంటే దూడగడ్డి కోసం అన్నట్లు అన్నాడు.

''వాళ్ళేమన్నా జూలోంచి పారిపోయొచ్చిన జంతువులా మామయ్యా?'' ఎగతాళిగా నవ్వాడు పెళ్ళికొడుకు తమ్ముడు వరుణ్.

వేలువిడిచిన మేనల్లుడి ధోరణి పిచ్చి చిరాకెత్తించగా ''వాళ్ళకి మర్యాద అక్కర్లేదా?'' అన్నాడు కళ్ళు తెరిచి వరుణ్ కళ్ళలోకి సూటిగా చూస్తూ.

'నీ తిక్క కుదిరే కిటుకు నాకు తెల్సులే. ఉండు' మనసులో అనుకుంటూ యివతలికొచ్చాడు వరుణ్.

''వుండండి. ఈ అయొడెక్స్ అప్లై చేసి పెయిన్‌కిల్లర్ ఇచ్చేస్తే ముహూర్తం టైమ్‌కి సార్ మెట్లు దిగి వచ్చేస్తారు'' అందర్నీ తప్పించుకుని వచ్చి సీసాలోంచి చిటికెడు ఐడెక్స్ తీసి చలపతికి కాలికి పట్టించసాగాడొకాయన.

''ఈ మాత్ర మింగించేయండి మీరెవరైనా'' ఎడమచేత్తో జేబులోంచి మాత్ర తీసి పీపుమీదుగా ఒకరికి అందించాడు.

''అమ్మో! టైమయిపోతోంది. తెమలండి తెమలండి'' అంటూ సుడిగాలిలా దూసుకొచ్చి ఆడంగులందర్నీ ఉద్దేశించి అన్నాడు పంతులుగారు.

''సరే..అన్నయ్యనలా విశ్రాంతిగా పడుకోనివ్వండి'' అని ప్రధానం ఏర్పాటు చేయించటానికి వెళ్ళింది పెళ్ళికొడుకు తల్లి.

ఆమె ఆ మాట అనటం ఆలస్యంగా అంతా ఒక్కొక్కళ్ళే చలపతి దగ్గర్నుంచి తప్పుకున్నారు.

ఒంటరిగా ఆ మంచం మీద పడుకోవటం చికాకనిపించి విసుగ్గా కళ్ళు మూసుకున్నాడు చలపతి.

★ ★ ★

''ఇప్పుడు మా మావయ్య ఆ మెట్లన్నిటి మీది నుంచీ జారిపడిపోయి వుంటే ఎంత అనర్థం జరిగేది? ఆ..'' గదిలో పడుకుని వున్న చలపతికి విన్పించేట్లు అరిచాడు వరుణ్.

అతని ప్రశ్నకు సమాధానం చెప్పటానికి గొంతు సవరించుకుని ''ఏ అనర్థమూ జరగలేదు గదండీ యిప్పుడు? మీ రుసరుసలు తప్పా?'' అన్నాడు హర్ష నవ్వాపుకుంటూ.

''అయితే ఆయన పడిపోయి కాలో, చెయ్యో విరగ్గొట్టుకుని ఆవిటివాడైపోతే అప్పుడు మీ కళ్ళు చల్లగా వుండేవన్న మాట!'' కంఠంలో కోపాన్ని ధ్వనింపజేస్తూ హెచ్చు స్థాయిలో అన్నాడు వరుణ్.

ఆ మాటలు విని అప్రయత్నంగా తన కాళ్ళూ చేతులూ తడుముకున్నాడు చలపతి.

''మగపెళ్ళివారని మర్యాద మచ్చుకైనా

## రవ్వదోశ అంటే రొంబ ఇష్టం!

కేరళ కుట్టి అని చాలామంది అనుకునే ప్రియమణి తమిళమ్మాయి. అయితే బాల్యమంతా బెంగుళూరులోనే గడపడంతో కన్నడ భామ అని కూడా చాలామంది పొరబడతారు. ఈ తమిళపొన్ను ప్రియమణికి ఇష్టమైన ఫుడ్ ఏమై వుంటుంది అని మీరనుకుంటున్నారు? సాధారణంగా ఇడ్లీ-సాంబార్ అయి వుంటుందని కదా! కానీ ప్రియమణికి మాత్రం రవ్వ దోశ అంటే బలే ఇష్టంట. మూడొందల అరవై ఐదు రోజులూ రవ్వదోశ తిని బతికేయమన్నా తను బతికేస్తానంటుంది. రవ్వ దోశ అంటే అంత ఇష్టమట ఆమెకి.



కన్పించటం లేదు మీలో'' ఈసడించాడు.

శాండిల్య తన పోర్షన్ అందుకున్నాడు. ''మగపెళ్ళివారని ఒక్కొక్కర్నీ నెత్తినెట్టుకుని వూరేగమంటారా ఏమిటి? జరుపవలసిన మర్యాదలన్నీ జరుపుతూనే వున్నాంగా''

''ఏంటయ్యా మీరు చేసిన మర్యాదలు? పెళ్ళికొడుకు కారుకి ఒక్క పూలదండైనా వేశారా? విడిదిలో అమర్చిన రెండద్దాల మీదా అరంగుళం మందాన దుమ్ముపేరుకుపోయింది''

''మేమన్నీ క్లియర్‌గానే అమర్చాం. మీ బచ్చి కానాలెవరో వాటికేదో రాసి వుంటారు. దానికి మమ్మల్ని తప్పుపడ్తే ఎలా?'' రెట్టించినట్లు అన్నాడు శాండిల్య.

''అయితే మావాళ్ళకి అద్దం చూసుకోవటం కూడా రాదనా మీ ఉద్దేశ్యం?'' ఉక్రోషంగా అన్నాడు వరుణ్.

''మీరు తెచ్చిన టిఫిన్లలో జీడిపప్పు మచ్చుకైనా కన్పిస్తోందా? ఎవరో ముష్టివాళ్ళకు తెచ్చినట్లు తెచ్చి మా మొహాన్నేశారు. ఆఖరికి మీరిచ్చిన డ్రింకింగ్ వాటరయినా శుభ్రంగా ఏడ్చిందా?'' తన డైలాగ్‌ని ఘాటుగా ఉచ్చరించాడు అరవింద్.

''మీ భేషజాలన్నీ ఈ పూటే తీర్చేసుకోవాలంటే ఎలాగండీ?'' చేతులు తిప్పేస్తూ చురుగ్గా అన్నాడు శాండిల్య.

''ఏయ్! మాటలు మర్యాదగా రానీ. నాక్కోపం వచ్చిందంటే నాలుక చీరేస్తాను'' ఆవేశ రసాన్ని అద్భుతంగా పోషించాడు వరుణ్.

''ఆ చీరటం మాకూ వచ్చు. అనవసరంగా నోరుపారేసుకోకండి''

ఈ తతంగమంతా అక్షరం పొల్లుపోకుండా గదిలోపల చలపతి చెవులబడ్తూంటే అనుకోకుండా తంటా పెద్ద స్థాయిలో రేగినందుకు అతని మనసు ఆవుపాల పరమాన్నం తిన్నంత సంతృప్తితో నిండిపోయింది.

తన కాలునొప్పిని కూడా లక్ష్యం చేయక హుషారుగా మంచంమీద నుంచి లేచి కుంటుకుంటూ బైటకొచ్చాడు.

అతని రాకను ఓరగా గమనించిన మిత్ర బృందం షర్టులు చేతులు మడుచుకుని కుమ్ములాటకు సిద్ధంగా వున్నట్లు ఫోజు పెట్టారు.

''కూల్‌డౌన్ మై బాయ్స్! కూల్‌డౌన్'' గొంతుక చించుకున్నట్లు అరిచాడు చలపతి.

అందరూ తమ ముఖాలలోని భావాలు మారకుండా జాగ్రత్తపడ్తూ ఆయనవేపు చూశారు.

''ఇంకో రెండు గంటల్లో ముహూర్తం పెట్టుకుని ఏవిటయ్యా మీ తగవులాట?'' నెమ్మదిగా హితవు చెప్తున్నట్లు అన్నాడు.

''అదేంటో తంటా పెట్టుకున్న ఆయన్తో చెప్పండి'' ముక్కుపుటాలదిరిస్తూ అన్నాడు హర్ష.

''ఆ..మీరు పెట్టింది అరక్క తంటా పెట్టుకున్నాం. ఎక్కడో తండా మనుషులూ తండా కథాను?'' ఆవేశంపాలను మరికాస్త హెచ్చించి అన్నాడు వరుణ్.

''మరీ ఎక్స్‌ట్రా చేస్తున్నావురా. తర్వాత డైలాగులు మాకు తోచటం లేదు'' వరుణ్ చెవి దగ్గర నోరుపెట్టి గొణిగాడు హర్ష.

''ఇక ఫుల్‌స్టాప్‌లే'' గుసగుసగా అన్నాడు వరుణ్.

కుంటుతూనే వాళ్ళమధ్యకు వచ్చి వరుణ్ భుజం పట్టుకు నిలబడ్డాడు చలపతి.

''వూరుకోండ్రా కుర్రాళ్ళూ! వూర్కోండి. ఏదో నలుగురి మీద పొరపాట్లేమన్నా జరగొచ్చు. ఇలా రాద్ధాంతం పెట్టుకోవటం తప్పుగదూ?'' నోటిమీద వేలుంచుకుని అందర్నీ ఉద్దేశించి హితవు చెప్పాడు.

మిత్రులంతా వరుణ్‌కేసి విస్తుబోతూ చూశారు.

మౌనంగా వాళ్ళకు కన్నుగీటి ''వీళ్ళ సంగతేంటో తేలందే నేనిక్కడ్నుంచి కదలను మామయ్యా'' అన్నాడు తలవిదిలిస్తూ.

వెంటనే యాక్షన్‌లోకొచ్చేశాడు శాండిల్య. ''చూడండి బాబాయిగారూ ఆగిర! ఒళ్ళు మండుతోంది మాకు'' అన్నాడు.

''ఒళ్ళు మండటం లేదూ, వాడమండటం లేదూ. పెద్దవాణ్ణి నే చెబుతున్నాగా. వూర్కోండి'' అన్నాడు చలపతి అందర్నీ బ్రతిమాలుతూ.

''వూర్కుంటే మరీ రెచ్చిపోతారు మామయ్యా వీళ్లు!'' ఆవేశంతో బుసలు కొట్టాడు వరుణ్.

''అయ్యో! అంతా ప్రధానం దగ్గరకెళ్ళినట్లున్నారు. మనం కూడా పోదాం పదండి'' వరుణ్ చేతిని గట్టిగా పట్టుకుని అన్నాడు చలపతి.

''నువ్వు దిగలేవుగా మామయ్యా?'' వరుణ్ చలపతి కాలికేసి చూశాడు.

''నిన్నాసరా చేసుకు దిగేస్తాలే. నొప్పి కాస్త తగ్గింది'' వరుణ్ చేతిని వదలకుండా అన్నాడు చలపతి.

చుట్టూవున్న ఫ్రెండ్స్‌కి సైగ చేశాడు వరుణ్.

వాళ్ళంతా చకచకా మెట్లు దిగి వెళ్ళిపోయారు.

ఒక పావుగంట గడిచాక ఫ్రెండ్స్‌ని కలుసుకున్న వరుణ్ ''చూశారా! దటీజ్ చలపతి మామయ్య!'' అన్నాడు నవ్వుతూ.

''నువ్వన్నట్లు తంటా అంటే ఆయనకంత యిష్టంగా వున్నట్లు అన్పించలేదే?'' శాండిల్య అడిగాడు.

''తంటా తర్వాత తనే సర్దిచెప్పి సవ్యం చేయటం ఆయనకు చాలా యిష్టం'' వరుణ్ నవ్వుతో ఫ్రెండ్సంతా శ్రుతి కలిపారు.

☆

## శ్రియ కోరిక!

**శ్రియకి రజనీకాంత్‌తో నటించాలనే కోరిక వుండేది. ఆ కోరిక 'శివాజీ' సినిమాతో నెరవేరింది. అలాగే హిందీలో హృతిక్‌రోషన్‌తో కలిసి నటించాలని కూడా వుందిట. మరి ఆ కోరిక ఎప్పుడు తీరుతుందో ఏమో గానీ 'శివాజీ' ఇప్పుడు రిలీజైపోయింది కాబట్టి ఇక శ్రియ ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ హీరోయిన్‌గా నటించడానికి కొత్త సినిమాల్ని ఒప్పుకోవచ్చు. ఎందుకంటే 'శివాజీ' పూర్తయేవరకూ ఆమె మరో సినిమాలో హీరోయిన్‌గా నటించకూడదనే షరతు వుండడంతో కేవలం ఐటమ్ నంబర్లు చేస్తూ వచ్చిందామె. ఇప్పుడా నిబంధన తొలగిపోయింది. తాజాగా ఆమె ప్రభాస్ సరసన హీరోయిన్‌గా 'షాడో' సినిమాలో నటించడానికి ఒప్పుకుందిట. పూరి జగన్నాథ్ ఈ సినిమాకి దర్శకుడు.**

